క్లుప్తంగా

ప్రమాద ఘటనలో మృతులకు అంత్యక్రియలు

మండపేట: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన మండపేట పట్టణానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన భోగిళ్ల వెంకటసత్య సురేస్, భార్య భోగిళ్ల నవ్య, కుమార్తె భోగిళ్ల వాసుకికృష్ణల అంత్యక్రియలు శనివారం తెల్లవారుజామున జరిగాయి. తణుకులో పోస్టుమార్టం పూర్తయిన అనంతరం ముగ్గురి మృతదేహాలను అదేరోజు రాత్రి ప్రత్యేక వాహనంలో వారి స్వగృహానికి కుటుంబ సభ్యులు తీసుకుని వచ్చి తెల్లవారుజామున అంత్యక్రియలు పూర్తి చేశారు. శనివారం ఉదయం రావులపేటలో ఉన్న వారి నివాసానికి బంధువులు, స్నేహితులు, రావులపేట ప్రజలు వెళ్లి తమ దిగ్భ్రాంతి చెంది తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కాగా ఆ ప్రమాదంలో బయటపడిన వారి మరో బంధువు ఉప్పులూరి శ్రీరమ్యకు ప్రస్తుతం రాజమహేంద్రవరం బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే వున్నట్టు తెలిసింది. అయితే కాలు విరగడంతో ఆపరేషన్, చేతి నరాలు తెగిపోవడం వల్ల చేతికి ఆపరేషన్ చేసినట్టు వారి బంధువులు తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్

మండపేట: కడవరి వర్షపు సంఘం వ్యవస్థాపకుడు ధర్మవీర్ పాల్ ఆధ్వర్యంలో మండలంలోని ఏడిదలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రక్తహీనత, సుగర్, బీపీ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, ఇతర వ్యాధులకూ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం కళ్లజోళ్లు అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామంలో పలు శారీరీక బాధలతో ఇబ్బంది పడుతున్న అనేక మంది శిబిరంలో సేవలు పొందారు. మొత్తం 800 మందికి వైద్య సేవలు అందుకున్నారు. ధర్మవీర్‌పాల్ మాట్లాడుతూ కరోనా తర్వాత చాలా మంది అనారోగ్యంతో బాధపడుతున్నారని వారికి ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో గ్రామంలో శిబిరం నిర్వహించామన్నారు. అలాగే అక్కడి వచ్చిన రోగులకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు కూడా చేశారు. డాక్టర్లు స్మరణ, ప్రసన్నకుమార్, పెందుర్తి కిషోర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపుష్పయాగం

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీపుష్పయాగం పూజలు చేశారు. అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్ భార్గవ్, సంపర లక్ష్మీనరసింహ భాస్కర శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. నేడు ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఈఓ రాంబాబు తెలిపారు.

ఏడిదలో ఆలయ పునఃప్రతిష్ఠ

మండపేట: మండలంలోని ఏడిదలో వేంచేసిన రాజరాజేశ్వరరి సమేత శ్రీ కైలాసేశ్వర స్వామి వారి ఆలయం పునః ప్రతిష్ఠాపన శనివారం గ్రామంలో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు ఆయనను ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించారు.

అయ్యప్పస్వామికి జన్మనక్షత్ర పూజలు

రాయవరం: వెదురుపాక శ్రీ, భూ సమేత జనార్ధన స్వామి ఆలయంలో ఉన్న అయ్యప్ప స్వామి పీఠం వద్ద అయ్యప్పస్వామి జన్మనక్షత్ర పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణమాసం ఉత్తర నక్షత్రం పురస్కరించుకుని పీఠం గురుస్వామి బండారు వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుతగా అయ్యప్పస్వామికి అర్చనలు, హారతులు నిర్వహించారు. భక్తులతో భజనలు నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి ఆడిట్ ప్రక్రియ ప్రారంభం

రామచంద్రపురం రూరల్: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులకు సంబంధించిన ఆడిట్ ప్రక్రియ రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ప్రారంభమైనట్లు మండల ఏపీఓ మోర్త ఈశ్వరరావు విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 17న సోమవారం ఉదయం 10 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొనవలసిందిగా కోరారు.

భానుడి భగభగలు

- మార్చిలోనే మే వచ్చినట్లుగా..
- బయటకు వచ్చేందుకు భయపడుతున్న జనం
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- శీతల పానీయాలకు పెరుగుతున్న గిరాకీ



గొడుగుల నీడన వ్యాపారాలు



ఉష్ణతాపాన్ని తీర్చుకునేందుకు శీతల పానీయాలు తాగుతున్న ప్రజలు

రాయవరం: భానుడు రోజురోజుకూ తన భగభగలు పెంచుకుంటూ పోతున్నాడు. మార్చి నెలలోనే మే వచ్చినట్లుగా గ్రీష్మతాపం ఉంది. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో మధ్యాహ్నం వేళ రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి తాపానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు, దాహార్తిని తీర్చుకునేందుకు ప్రయాణికులు చల్లని పానీయాలతో సేదతీరుతున్నారు.

39 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రత

గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా శనివారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి రావడానికి భయపడుతున్నారు. మార్చి నెలలోనే ఎండలు ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటాయో? అని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. ఎండ వేడికి ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అల్లాడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎండవేడిని తట్టుకునేందుకు టోపీలు, మాస్కులు ధరిస్తున్నారు. మహిళలు గొడుగులు వినియోగిస్తున్నారు.

శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ

భానుడి భగభగల నుంచి కొంతైనా ఉపశమనం పొందేందుకు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే పెరిగిన ధరలు మాత్రం సామాన్యులకు నీరసం రప్పిస్తున్నాయి. చల్లదనం కోసం శీతల పానీయాలు, పలు రకాల పళ్ల రసాల వైపు ప్రజలు ఆసక్తి చూపుతుండడంతో ఎక్కడ చూసినా శీతల పానీయాల దుకాణాలు, జ్యూస్ సెంటర్ల హడావుడి ప్రారంభమైంది. కొబ్బరి నీరు, లస్సీ, బొప్పాయి, ద్రాక్ష, పైనాపిల్, పుచ్చకాయ తదితర రకాల పండ్ల రసాలను ఆశ్రయిస్తున్నారు. ఇదిలా ఉంటే ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులు ఎండ తీవ్రత కారణంగా నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్షలు రాసిన అనంతరం ఉత్సాహంతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

రాయవరం: రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన ఫస్టియర్ పరీక్షలు 13వ తేదితో ముగియగా, 3వ తేదీన ప్రారంభమైన సెకండియర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. మొదటి సంవత్సరం అన్ని సబ్జెక్టులు కలిపి 1,527 మందికి గాను 72 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, ద్వితీయ సంవత్సరం 864 మందికి గాను 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డీవీవీ నాగేశ్వరరెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా సుబ్బారావు వ్యవహరించారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఫ్లస్–2 పాఠశాల విద్యార్థులతో పాటుగా, స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



గొల్లపాలెంలో కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: బహుజన సమాజ్‌వాదీ పార్టీ(బీఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని శనివారం గొల్లపాలెంలో ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బీవీఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రత్తిపాటి బుల్లిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాత సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాత సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 1984 ఏప్రిల్ 14 ఉత్తరప్రదేశ్‌లో కాన్షీరాం స్థాపించిన బీఎస్పీ అనతికాలంలోనే దేశవ్యాప్తంగా బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు ముదుకు రాంజీ, ఉపాధ్యక్షుడు వెంకన్న బాబు, పార్టీ నాయకులు నాగేశ్వరరావు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొత్తపేట డివిజన్ అదనపు వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలం పరిధిలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం నిర్వహించిన చిన్నారులకు టీకాల ప్రక్రియను ఆమె పరిశీలించారు. వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ ఆధ్వర్యంలో ఆలమూరు–2, కలవచర్ల, పెదపళ్ల, చింతలూరు, కలవచర్ల, చొప్పెల్ల, మోదుకూరు, మడికి, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 150 మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ, ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివ ప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి పర్యవేక్షించారు.

ఓటర్ల జాబితాపై అభిప్రాయ సేకరణ



వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అఖిల

రామచంద్రపురం: నియోజకవర్గ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకునేందుకు రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల శనివారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎస్ఎస్ఆర్–2025 ప్రకారం మొత్తం 2,03,193 మంది ఓటర్లు నమోదై ఉన్నారన్నారు. బీఎల్ఓలు బూత్ లెవెల్ ఏజెంట్లతో సమన్వయం చేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలిన చేసి లోపాలు లేని ఓటర్ల జాబితా తయారు కావడానికి కృషి చేయాలని సూచించారు. అదే విధంగా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ప్రభుత్వమే ఆటోలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధులు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలు మండలాల తహసీల్దార్లు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రస్టు సేవలు అభినందనీయం



హోమియో మందు వేస్తున్న ఫణీంద్ర

మండపేట: పదిహేనేళ్లుగా ప్రజల ఆరోగ్య భద్రత కోసం, పేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్‌బీఎస్సార్ ట్రస్టు సేవలు అభినందనీయమని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆడిటర్ మారెళ్ల గంగరాజు శర్మ అన్నారు. మండలంలోని అర్తమూరులో శనివారం ట్రస్టు నిర్వహించిన 181 వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన శర్మ, ఆయన కుమారుడు శ్రీకృష్ణఫణీంద్రలు ప్రారంభించారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో ఆసుపత్రి వైద్య నిపుణులు శ్యామ్‌నాయక్, జి.శివరంజని, ఎంఏఎస్ సూర్యకళ, ఎస్ఎస్ లత, పద్మావతిలు రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శర్మ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా సత్తిబులిస్వామి చేస్తున్న సేవలు ఎంతో మందికి ఉపయోగకరంగా వుంటున్నాయన్నారు. కుట్టుమెషీన్ కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడం ఆనందదాయకమన్నారు. 280 మందికి మందులు పంపిణీ చేశారు. అనపర్తి డాక్టర్ సుమామాధురి, తాడి కోదండరామారెడ్డి మాస్టారు, తాడి సుబ్బిరెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, తాడి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి, కేబీఎస్ఎస్ రాజు, వెలగల శివారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, జీవీఎస్ఎన్ మూర్తి, కొవ్వూరి గంగిరెడ్డి, హేమలత, నాగరత్నం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జస్టిస్



జస్టిస్ శ్రావణ్‌కుమార్‌కు స్వామి చిత్రపటం ఇస్తున్న సారథి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ కుటుంబ సమేతంగా స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద జస్టిస్ శ్రావణ్ కుమార్‌కు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి, జస్టిస్‌కు అందజేశారు.

విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



ఆటపాటలతో ఎంజాయ్ చేస్తున్న విద్యార్థులు

మండపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ బీకాం పూర్తయిన విద్యార్థులకు జూనియర్స్ ఘనంగా వీడ్కోలు పలికారు. కళాశాల ఆవరణంలో వీడ్కోలు వేడుకలో విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు. తమ వద్ద చదువుకున్న విద్యార్థి ఉన్నతంగా రాణించి అభివృద్ధి సాధించినట్టు తెలిస్తే తమకు ఎంతో ఆనందం కలుగుతుందన్నారు. కళాశాలకు కూడా మంచి పేరు వస్తుందన్నారు. బ్యూలా గ్రేస్, ప్రేమ, సత్యలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిత్తజల్లు రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి బీకాం పూర్తి చేసిన వారికి కామర్స్ సబ్జెక్టు మనిషి జీవితంలో ప్రధానపాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీనియర్స్‌కు జూనియర్స్ జ్ఞాపికలను అందించారు. కామర్స్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, అధ్యాపకులు శంకర్, వెంకన్న, మధు, సుందర్, వీర్రాజు, దిలీప్, చంటి, రాజేష్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఆలమూరు: చింతలూరులోని నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలను అందించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీఓ పి.శ్రీకర్ కోరారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ముఖ మండప ఆవరణలో శనివారం ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల నిర్వహణపై సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి అధ్యక్షత వహించగా జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారి వి.సత్యనారాయణ, తనిఖీదారు ఎం.బాలాజీ రాంప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, డీఎల్‌పీఓ ఎ.రాజు, అడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ ఎస్.రవికుమార్, ట్రాన్స్‌కో ఏడీఈ సీహెచ్ శ్రీధర్, ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఫైర్ ఇన్‌స్పెక్టర్ జె.హనుమంతరావు, రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ కెడిఎస్ఎన్ కుమార్ హాజరయ్యారు. అన్ని శాఖల అధికారులు కలసికట్టుగా పనిచేసి జాతరను విజయవంతం చేయాలని అధికారులను కోరారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి



మండపేట కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

మండపేట: పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆరోగ్యకర వాతావరణం అందించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో కమిషనర్ టీవీ రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెప్మా ఆర్పీలతో అధికారులు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మెయిన్‌రోడ్డులో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. వేగుళ్ల మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహితంగా పట్టణాన్ని తీర్చిదిద్దాలన్నారు. ప్రజలు కూడా చైతన్యవంతులు అవ్వాలనే ఉద్దేశంతో ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత అనే నినాదాలతో పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. తొలుత కలువపువ్వు సెంటర్లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కాశిన కాశీవిశ్వనాథం, లయన్స్ క్లబ్ సభ్యులు, మున్సిపల్ అధికారులు కె.శ్రీనివాస్, జేవీఎస్ శాస్త్రి, పవన్‌కుమార్, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, శానిటరీ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, సీవోలు ఎం మహాలక్ష్మి, బి.వీరలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ప్రాధాన్యాన్ని గుర్తించాలి

కపిలేశ్వరపురం: స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమాదేవి, పీఎంసీ చైర్మన్ కె.భీమేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను చాటి చెప్పే నినాదాలు రాసివున్న ప్లకార్డులను చేతబట్టి నినదించారు. కాగితాలతో తయారు చేసిన మకుటాలను ధరించి పర్యావరణ ప్రాధాన్యతను తెలియజెప్పారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికురాలు నాగమణిని ఘనంగా సత్కరించారు.

గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

మండలంలోని 19 గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. అంగరలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రత్నకుమారి మాట్లాడుతూ పంచాయతీరాజ్, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో స్వచ్ఛ గ్రామాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించండి

కాజులూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లోని సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందితో ఎంపీడీవో సమావేశం నిర్వహించి పారిశుధ్య నిర్వహణపై తీర్మానాలు చేయించారు. అనంతరం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా గ్రామ వీధుల్లో ర్యాలీలు, మానవహారం నిర్వహించి ప్లాస్టిక్ వస్తువులు, చెత్త నిర్వహణపై స్థానికులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. పలు గ్రామాల సచివాలయ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

రామచంద్రపురం రూరల్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధించిన అంశంపై ప్రజల్లోను, వ్యాపారస్తుల్లోనూ అవగాహన కల్పించే విధంగా మండలంలోని ద్రాక్షారామలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా బోసు బొమ్మ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వ్యాపార సంస్థలకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగం అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పూర్తిగా నిషేధిద్దాం

రామచంద్రపురం: ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ వి. అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధానికి సహకరిద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామంలో మహిళలకు డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న ఈఓపీఆర్డీ తదితరులు

కె.గంగవరం: గ్రామాల్లో ఉన్నత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సరైన పద్ధతిలో సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఈఓపీఆర్డీ గౌరికుమారి, సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కూళ్ల గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు పూర్తి స్థాయిలో చెత్తను అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో మహిళలకు డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. తడిచెత్త, పొడి చెత్త డస్టబిన్లను సద్వినియోగం చేసుకుని తడి–పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని వారు కోరారు. ఈ చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి చెత్తను ఎరువుగా మార్చవచ్చన్నారు. తొలుత గ్రామంలో పారిశుద్ధ్యంపై గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ పరిపాలన అధికారి టీవీ సురేంద్రరెడ్డి, కార్యదర్శి ముద్రగడ చంటి, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అంగరలో అవగాహన ర్యాలీలో ఎంపీడీఓ రత్నకుమారి తదితరులు



మాచర ఉన్నత పాఠశాలలో పారిశుధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



కాజులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ తదితరులు



ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్ వద్ద స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు